క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల నరికివేత కారణంగా రావల్‌కోల్, కండ్లకోయ సబ్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు పవన్‌చందు, శశిధర్‌రెడ్డిలు తెలిపారు. రావల్‌కోల్, కండ్లకోయ పరిధిలో అన్ని పరిశ్రమలకు, వ్యవసాయ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న గుర్రం శ్రీధర్‌రెడ్డి

కీసర: అనారోగ్యం కారణంగా కీసర గ్రామానికి చెందిన గోరంటి లక్ష్మమ్మ ఆదివారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కీసర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మృతిరాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్, నాయకులు గోరంటి ప్రవీణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఆస్తి పన్ను చెల్లించాలి



పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ రాములు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఆస్తి పన్నులను విధిగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రాములు కోరారు. ఆదివారం మున్సిపల్ పరిధిలో పన్నుల వసూలు కోసం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పేరుకపోయిన ఇంటి పన్నులు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పన్నుల వసూళ్లలో బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం



అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ మండల ఇన్‌చార్జి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సామాజిక కార్యకర్త బాలయ్య హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో నర్సింహ, శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, అంజయ్య, రూపేశ్, వెంకటేశ్వర్ రావు, విష్ణు, నిఖిల్, భరత్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు మంచి, చెడులు నేర్పాలి




మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పాఠశాలలకు వెళ్లే తమ పిల్లలతో తల్లిదండ్రులు నిత్యం కొద్ది సమయం కేటాయించి వారికి మంచి, చెడు నేర్పించాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లిలోని సెయింట్ ఆంథోనిస్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి బాలలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, పాఠశాల చైర్మన్ నరిశెట్టి సుందరరాజు, ప్రిన్సిపాల్ షర్మిల క్రిస్టి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొర్రెముల్ గ్రామానికి చెందిన దయ్యాల దశరథ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా మృతుడి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్. చిత్రంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, వార్డు సభ్యుడు ఆంజనేయులు, కృష్ణ, బాలరాజ్ తదితరులు. – ఘట్‌కేసర్



క్రమబద్ధీకరణ కఠినం!

కొత్త జీఓ జారీతో భారీగా సొమ్ము చెల్లించాల్సిరావడంతో మేడ్చల్-మల్కాజిగిరి లబ్ధిదారుల్లో ఆందోళన

మరోసారి దరఖాస్తుల పరిశీలనకు చర్యలు

జీఓ 59 కింద వచ్చిన దరఖాస్తులు 28,280

జీఓ 58 కింద అందిన దరఖాస్తులు 33,258

స్థలాల క్రమబద్ధీకరణకు సొమ్ము చెల్లింపు.. 2014 జూన్ నుంచి 2022 మార్చి నాటికి మార్కెట్ విలువ పెంపు



సాక్షి,మేడ్చల్‌జిల్లా: జీఓ నంబరు 58, 59 కింద వచ్చిన దరఖాస్తులపై స్పష్టత రావడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మరింత మొదలైంది. ఈ జీఓల ద్వారా స్థలాలను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జీఓ నంబరు 58 కింద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 33,258 దరఖాస్తులు వచ్చాయి. సీసీఎల్ఏ దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్‌కు అర్హత అనుకున్నవి పంపించారు. జిల్లా అధికారులు వాటిని మరోసారి పరిశీలించి జీఓ నంబరు 58 ద్వారా లబ్ధిదారుల తుది జాబితాను రూపొందించాల్సి ఉంది. జీఓ 58 ప్రకారం ప్రభుత్వ స్థలంలో 2014 జూన్ 2 నాటికే 125 గజాలలోపు ఇళ్లు నిర్మించుకుని ఉండాలి. ఆ లబ్ధిదారుడు దారిద్ర్య రేఖకు దిగువ ఉండాలి. ఆ స్థలం దేవాదాయ, అసైన్డ్, వక్ఫ్ తదితర భూములై ఉండకూడదు. ఈ నిబంధనలతో అధికారులు క్షేత్ర స్థాయిలోకి పరిశీలించారు. జీఓ నంబరు 58 ద్వారా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హత ఉన్నవి దాదాపు 10వేల లోపే ఉన్నట్లు సమాచారం. వీరికి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

చాలా చోట్ల తిరస్కరణ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీఓ 59 కింద చేసుకున్న దరఖాస్తులను చాలా చోట్ల తిరస్కరించారు. ప్రధానంగా 59 జీఓ ప్రకారం వచ్చిన 13,280 దరఖాస్తులను పక్కనపెట్టారు. ప్రస్తుతం జిల్లాలో 15వేల దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. వీటిలోనూ కొందరు తప్పుడు పత్రాలు సమర్పించి దరఖాస్తులు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం తాజాగా దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి పరిగణలోకి తీసుకోవాలని కోరడంతో మళ్లీ 59 జీఓ దరఖాస్తులపై విచారణ చేపట్టనుండటంతో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

జీఓ 59పై సర్వే..

125 గజాల స్థలం కంటే అధికంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకుంటే జీఓ 59 కిందకు రానున్నాయి. ఈ జీఓ కిందకు వచ్చే వారు మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి ధర చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది ప్రభుత్వం రెండోసారి ఈ జీఓ జారీ చేసిన సమయంలో 2014 మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని పేర్కొంది. తాజాగా ప్రభుత్వం 2022 మార్చి నాటి మార్కెట్ విలువ ధర చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారులపై తీవ్ర భారం పడనుంది. ఈ జీఓ ప్రకారం జిల్లాలో 28,280 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 15వేలు అర్హత ఉన్నవిగా తేల్చారు. ప్రభుత్వ నిర్ణయంతో 2014కు బదులు 2022 నాటికి మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. 2014 జూన్ 2 నాటికి కబ్జాలో ఉన్న నిబంధనను ఎత్తేసి 2022లో దరఖాస్తు చేసుకున్న తేదీకి నిర్మాణంలో ఉండాలని నిబంధన పెట్టడంతో జిల్లాలో మరోసారి దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉంటుంది. దీంతో మరోసారి జీఓ 59 దరఖాస్తులను అధికారులు పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

యాదవ సంఘం భవనం ప్రారంభం

● ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించిన మంత్రులు శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి

● పాల్గొన్న ఎంపీ లింగయ్యయాదవ్, పలువురు ఎమ్మెల్యేలు



యాదవ సంఘం భవనంను ప్రారంభిస్తున్న మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో రూ.1.3 కోట్లతో నూతనంగా నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు లింగయ్య యాదవ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లతో పాటు జీహెచ్ఎంసీ కార్పొరేటర్ శ్రీదేవి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, యాదవ సంఘం కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'ప్రాణం ఉన్నంత వరకూ పాటలు పాడుతా..'

● సీపీఐ ప్రాథమిక సభ్యత్వానికి వెంకటాచారి రాజీనామా

● 30ఏళ్లుగా ప్రజల పక్షాన తన గళంతో చైతన్యం చేసిన కళాకారుడు



ప్రజా కళాకారుడు వెంకటాచారి

జవహర్‌నగర్: ప్రాణం ఉన్నంత వరకు పేదల హక్కుల సాధనకు పాటలు పాడతానని ప్రజా కళాకారుడు, గాయకుడు వెంకటాచారి అన్నారు. సీపీఐ ప్రాథమిక సభ్యత్వానికి వెంకటాచారి రాజీనామా చేశారు. గత 30 ఏళ్లుగా తన గళంతో తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరిచి సామాజిక ఉద్యమాలను నడిపించిన కళారుడిగా వెంకటాచారికి ఎంతో గుర్తింపు ఉంది. గత కొంత కాలంగా పార్టీలో కొంత మంది కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, దీంతో మనస్తాపానికి గురై సీపీఐతో పాటు ప్రజానాట్య మండలి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్‌కు రాజీనామా పత్రం ఆయన అందజేశాడు.

ధన రాజకీయాలను అణచివేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి

శామీర్‌పేట్: ధన రాజకీయాలను అణచివేసినప్పుడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలల స్వరాజ్యం ఏర్పాడుతుందని మూడుచింతలపల్లి మండల జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉద్దమర్రి గ్రామంలో ఆది జాంభవ సేవా సంఘం 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అధ్యక్షుడు రాజిగళ్ల నర్సింహా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హరివర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే వ్యవస్థలు సమతుల్యతతో నడుస్తున్నాయని, పేద, ధనిక తేడా లేకుండా సమానంగా హక్కును కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ అనురాధరవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశం, విష్ణుగౌడ్, మాందాల స్వామి, సంఘం సభ్యులు శ్రీకాంత్, స్వామి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

'సేవ చేయడంలోనే ఆనందం ఉంటుంది'



శిబిరంలో కార్పొరేటర్ నిహారికగౌడ్

జవహర్‌నగర్: నిరుపేదల కాలనీల్లో సమస్యలు లేకుండా చేయడమే తమ లక్ష్యమని కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ అన్నారు. ఆదివారం 28వ డివిజన్‌లోని మదర్‌థెరిస్సా కాలనీలో ట్రినిటీ హాస్పటల్ సహకారంతో ఉచిత హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో దాదాపు 120 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, ట్రినిటీ ఆస్పటల్ సీఈఓ డాక్టర్ ఎస్‌డీ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రగతి, అమృత, బాచుపల్లి రమేష్‌చారి, బూడిద వెంకటేష్, ఎం.మంజుల, రవి, వెంకటేష్, శ్రీనివాస్, పర్వతాలు, బద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునుడి కల్యాణం



స్వామి వారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్: కాచివానిసింగారం శ్రీమల్లికార్జున స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మల్లికార్జునుడి కల్యాణంను నిర్వహించగా మంత్రి మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యుడు సుదర్శన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

తైక్వాండో టెస్ట్.. బెల్టుల ప్రదానం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో చిదం తైక్వాండో శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 250 మంది విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించి బెల్ట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగారం బీఆర్ఎస్ నేత గూడూరు ఆంజనేయులుగౌడ్, మాస్టర్ నందకిషోర్, తెలంగాణ తైక్వాండో అసోషియేషన్ జనరల్ సెక్రెటరీ, గ్రాండ్ మాస్టర్ ఎ.ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బెల్ట్‌లు ప్రదానం చేస్తున్న ఆంజనేయులుగౌడ్

మోసాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



నిందితుల్లో ఒకరైన శ్రీధర్‌గౌడ్

కీసర: నోటరీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి వివరాల ప్రకారం... కుందన్‌పల్లి శ్రీరామలింగేశ్వర కాలనీకి చెందిన పుట్ట శ్రీధర్ గౌడ్, కృష్ణగౌడ్, మోసపూరిత నోటరీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ద్వారా అమాయకపు ప్రజలను మోసం చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గతంలో వీరిపై ఎనిమిది క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. నోటరీ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఎలాంటి అనుమానస్పద కార్యకలాపాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని సీఐ సూచించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా పాదయాత్ర



జవహర్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

జవహర్‌నగర్: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్ బస్తీ నుంచి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ కోకన్వీనర్ శివ మాదిగ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును తెస్తామని ప్రగల్భాలు పలికి తీవ్ర అన్యాయం చేసిందని, వెంటనే వర్గీకరణ బిల్లును తేకుంటే బీజేపీ ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, సదానందం, రాంచందర్, స్వామి, ప్రభాకర్, గోపి, నిఖిల్, కార్తీక్, ఉదయ్, బాలకృష్ణ, అనిల్, కరుణాకర్, ఎల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

రామంతాపూర్: రామంతాపూర్ మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. నగరంలోని ఇళ్లలో పని చేసే మహిళా కార్మికులు, మురికివాడల్లో నివసించే మహిళలు, ట్రాన్స్‌జెండర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్ మాట్లాడుతూ ఏ దేశంలో అయితే మహిళలు సాధికారత సాధించి ఆర్థికంగా బలపడతారో ఆ దేశం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే మహిళలకు ఇంకా అనేక సౌకర్యాలు, వేతనాలు పెంచే అవసరం ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సంజయ్ కాకర్ల, మౌంట్‌ఫోర్ట్ ఇనిస్ట్యూట్ డైరెక్టర్ వర్గీస్ టేకనాథ్, తెలంగాణ, ఏపీ మానవ హక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్, ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త రచన పాల్గొన్నారు.

మేడ్చల్‌లో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో జంగయ్య తదితరులు

కీసర: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్‌లో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బోడ జంగయ్య అన్నారు. ఆదివారం కీసరలో నిర్వహించిన బీఎస్పీ ఈసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో నియోజకవర్గం పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు శ్రీహరిచారి, ఎర్రవల్లి మల్లేష్, యాట స్వామి, యాదగిరి, కృష్ణ, జగన్నాథ్, రమేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల కాలికి గాయమై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణను ఆదివారం ఆయన నివాసం వద్ద కలిసి ఆయనను పరామర్శిస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి. చిత్రంలో జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిర, నాయకులు శ్రీహరిగౌడ్, కురం రాము, రాంరెడ్డి తదితరులు. – కీసర



అయాన్ పరీక్షా కేంద్రం నిర్వాహకులపై ఫిర్యాదు

మల్కాజిగిరి: నీట్ పరీక్ష సందర్భంగా కేంద్రంలో కంప్యూటర్ పనిచేయకపోవడంతో అభ్యర్థి పరీక్షా కేంద్రం నిర్వాహకులపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన డాక్టర్ కరిష్మా ఆదివారం మౌలాలిలోని అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రం (ఐడీజెడ్)లో నీట్ పీజీ పరీక్ష రాసేందుకు వచ్చింది. పరీక్ష రాసే సమయంలో కంప్యూటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో పరీక్ష సరిగ్గా రాయలేకపోయానని మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



కీసర: నాగారం మున్సిపాలిటీ 7వ వార్డులో బంజారాలు సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో బీఆర్ఎస్ నాయకుడు గూడూరు ఆంజనేయులుగౌడ్, వెంకన్న, సుభాష్‌నాయక్, శ్రీనునాయక్, రూప్‌చంద్, నాగేశ్వరరావు, భాస్కర్ నాయక్, పాండునాయక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ ప్లాంట్‌పై కాలనీవాసుల వ్యతిరేకత



ప్లాంట్ నిర్వాహకులను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు

పోచారం: నిర్మాణంలో ఉన్న రెడీ మిక్స్‌డ్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ప్లాంట్‌ను సమీపంలోని నారపల్లి శ్రీరాంనగర్ కాలనీవాసులు వ్యతిరేకిస్తున్నారు. ఇందులో భాగంగా ప్లాంట్ యజమానులను కాలనీవాసులు ఆదివారం కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాలకు దూరంగా ప్లాంట్‌ను తరలించాలని, కాలనీలోని ఇరుకైన మట్టి రోడ్లపై కాంక్రీట్ ట్రక్కులు ఎలా తిరుగుతాయని ప్రశ్నించారు. వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమవుతాయని, గాలిలో సిమెంట్, దుమ్ము రేణువులు కలిసి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందన్నారు. ఇప్పటికైనా ప్లాంట్ నిర్మాణ పనులను నిలిపివేయాల నిర్వాహకులను డిమాండ్ చేశారు. అందుకు ప్లాంట్ నిర్వాహకుడు ప్రవీణ్‌రెడ్డి స్పందిస్తూ.. తమ పార్ట్‌నర్లతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీరాంనగర్ సోషల్ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు బానోతు శ్రీను, సిరిగిరెడ్డి రమణారెడ్డి, డాక్టర్ అర్జున్, కె.రవి, ప్రసాద్, మహేష్, మురళీ కృష్ణ, వేణుగోపాల్, శ్రీధర్, సురేంద్ర, సవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వెంకటేశ్వరనగర్ వాసులతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అధ్యక్షుడు రమేశ్

ఘట్‌కేసర్: సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తానని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్ శ్రీవెంకటేశ్వర నగర్ కాలనీలో ఆ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు గుజ్జ రమేశ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాలనీలో ఇంటి నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, ఇంటి నంబర్ కేటాయింపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సలహాదారులు జయమ్మ, సిద్ధుగౌడ్, జహంగీర్, పవన్ కల్యాణ్, మణీదీప్, నరేందర్ పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ముగిసిన యువజన సమ్మేళనం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మ గూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు యూత్ కాంక్లేవ్ పేరుతో నిర్వహించిన యువజన సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఈ సమ్మేళనంలో వివిధ ఆటల పోటీల్లో విజేతలైన యువతకు ముఖ్యఅతిథిగా విచ్చేసి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్టర్లు త్రిశూల్‌రెడ్డి, త్రిలోక్‌రెడ్డి, ప్రొఫెసర్లు, పీడీలు అనూల్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోక్‌నాథం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం అభినందనీయం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: కాలనీవాసులు, దాతల సహకారంతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం అభినందనీయమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ ఈస్ట్‌గాంధీనగర్ కాలనీలో కాలనీవాసులు, దాతల సహకారంతో సుమారు రూ.13 లక్షలతో కాలనీకి చెందిన యుటిలిటీ స్థలంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాదిరెడ్డి స్వప్న, నాయకులు తేళ్ల శ్రీధర్, నిమ్మల శ్రీను, కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు నాంచారి కృష్ణారెడ్డి, శ్రవణ్, లింగారెడ్డి, జశ్వంత్‌సింగ్, మూర్తి, ప్రభాకర్, కిలారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో మొదలైన హోలీ సంబరాలు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ ఇస్కాన్ మందిరంలో గోదావరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ సంబరాలను ఆదివారం రాత్రి ఫౌండేషన్ ఫౌండర్, బీజేపీ నాయకుడు మురళీధర్‌రావు ప్రారంభించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, గివర్ధన్‌రెడ్డి, వంశీ, ఇస్కాన్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోలీ సంబరాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు



హాజరైన భక్తులు



ఇస్కాన్ ఆలయంలో మురళీధర్‌రావు